కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

శ్రీమచ్ఛంకరాచార్య విరచిత

భవానీ భుజంగ ప్రయాత స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

భవానీ భుజంగ ప్రయాత స్తోత్రమ్ - భావార్థముతో.

01\. షడాధార పంకేరు హాందర్విరాజ-
త్సుషుమ్నాంత రాలేఽ తితే జోల్ల సంతీమ్।
సుధా మండలం ద్రావయంతీం పిబంతీం
సుధామూర్తి మీడే చిదానంద రూపామ్॥

షడాధారచక్రము మొదలైన ఆరు పద్మముల మధ్యలో విరాజిల్లు సుషుమ్నా నాడి లోపల అతి తేజస్సుతో ప్రకాశించుచున్నది, సహస్రార చక్రము నందలి అమృతమును ద్రవింపచేసి త్రాగుచున్నది అగు జ్ఞానానందరూపిణియైన అమృతమూర్తిని (భవానీదేవిని) స్తుతించుచున్నాను.

02\. జ్వలత్కోటి బాలార్క భాసారుణాంగీం
సులావణ్య శృంగార శోభాభి రామామ్।
మహాపద్మ కింజల్క మధ్యే విరాజ-
త్త్రికోణే నిషణ్ణాం భజే శ్రీభవానీమ్॥

జ్వలించుచున్న కోటి బాలసూర్యుల వంటి వెలుగుతో ఎఱ్ఱనైన శరీరముకలది, మంచి లావణ్యము చిందు శృంగారశోభతో మనోహర మైనది, మహాపద్మమునందలి కేసరముల మధ్యలో విరాజిల్లు త్రికోణమునందు కూర్చున్నది అగు శ్రీ భవానీదేవిని స్తుతించుచున్నాను.

03\. క్వణత్కింకిణీ నూపురోద్భా సిరత్న-
ప్రభాలీఢ లాక్షార్ద్ర పాదాబ్జ యుగ్మమ్।
అజేశాచ్యుతాద్యైః సురైః సేవ్యమానం
మహాదేవి మన్మూర్ధ్ని తే భావయామి॥

ఘల్లుమను గజ్జెలు కల పాదాభరణములలో ప్రకాశించు రత్నముల కాంతి ప్రసరించినవి, మరియు పారాణితో ఎర్రనైనవి అగు నీ పాద పద్మములను బ్రహ్మ-శివుడు-విష్ణువు మొదలైన దేవతలచే సేవింపబడు వాటిని ఓ మహాదేవీ! నా తలపై ఉన్నట్లుగా భావించుచున్నాను.

04. సుశోణాంబ రాబద్ధ నీవీ విరాజ-
న్మ హారత్న కాంచీ కలాపం నితంబమ్।
స్ఫురద్ద క్షిణావర్త నాభిం చ తిస్రో
వలీ రంబ! తే రోమరాజిం భజేఽహమ్॥

సొగసైన ఎర్రని చీరపై బంధించిన ఒడ్డాణమునందలి మహారత్నములతో శోభించు నితంబమును, అందముగా కుడివైపు సుడి తిరిగిన బొడ్డును, మూడు ముడతలను, పొట్టపై ఉన్న రోమపంక్తిని నేను సేవించుచున్నాను.

05. లసద్వృత్త ముత్తుంగ మాణిక్య కుంభో-
పమశ్రీస్తన ద్వంద్వ మంబాంబుజాక్షి।
భజే దుగ్ధ పూర్ణాభిరామం తవేదం
మహాహారదీప్తం సదా ప్రస్నుతాస్యమ్॥

పద్మముల వంటి కన్నులు కల ఓ తల్లీ! మంచి వృత్తాకారములో ఉన్నవి, ఎత్తైనవి, మాణిక్య కుంభముల వలే శోభిల్లుచున్నవి, పాలతో నిండి మనోహరమైనవి, గొప్ప హారములతో ప్రకాశించుచున్నవి, అగు నీ స్తనములను ఎల్లప్పుడు సేవించుచున్నాను.

06. శిరీష ప్రసూనోల్ల సద్బా హుదండై-
ర్జ్వలద్బాణకోదండ పాశాంకు శైశ్చ।

చలత్కంకణో దారకేయూర భూషో-
జ్జ్వలద్భిర్ల సంతీం భజే శ్రీభవానీమ్॥

జ్వలించుచున్న బాణము - ధనుస్సు - పాశము - అంకుశము పట్టుకున్నవి, కదలాడు కంకణములు కేయూరములు మొదలైన ఆభరణములతో ఉజ్జ్వలమైనవి అగు దిరిసెనపువ్వుల వంటి బాహువులతో శోభిల్లుచున్న శ్రీ భవానీ దేవిని సేవించుచున్నాను.

07. శరత్పూర్ణ చంద్ర ప్రభా పూర్ణ బింబా-
ధరస్మేర వక్త్రార విందాం సుశాంతమ్।
సురత్నావళీ హారతాటంక శోభం
మహా సుప్రసన్నాం భజే శ్రీ భవానీమ్॥

శరత్కాలమునందలి నిండు జాబిల్లి వలే ప్రకాశించు ముఖము, చిరునవ్వులొలుకు దొండ పండు వంటి క్రింది పెదవి కలదై, మిక్కిలి శాంతమూర్తియై, రత్నహారములు మరియు చెవికమ్మలు ధరించి ఎల్లప్పుడు ప్రసన్నంగా ఉండు శ్రీ భవానీదేవిని సేవించుచున్నాను.

08. సునాసాపుటం సుందర భ్రూలలాటం
తవౌష్ఠ శ్రియం దానదక్షం కటాక్షమ్।
లలాటే లసద్గంధ కస్తూరి భూషం
స్ఫుర చ్ఛ్రీ ముఖాంభోజ మీడేఽ హమంబ॥

అందమైన ముక్కు, సుందరమైన కను బొమలు మరియు నుదురు, శోభిల్లు పెదవులు, కోరినదిచ్చు కటాక్షము, నుదుటన వెలుగొందు సువాసన కల కస్తూరీతిలకము కలిగి ప్రకాశించుచున్న నీ ముఖపద్మమును ఓ తల్లీ! నేను స్తుతించుచున్నాను.

09. చలత్కుంత లాంతర్భ్రమద్ భ్రుంగ బృన్దం
ఘనస్నిగ్ధ ధమ్మిల్ల భూషోజ్జ్వలంతే।
స్ఫురన్మౌళి మాణిక్య బద్ధేందు రేఖా-
విలాసోల్ల సద్దివ్య మూర్ధాన మీడే॥

తుమ్మెదలు వాలుచున్న చంచలమైన కురులు కలది, మేఘం వలే నల్లనై దట్టమైన కొప్పులో ఆభరణములను అలంకరించు కున్నది, మాణిక్యములు మరియు చంద్రకళ విలసిల్లు కిరీటము ధరించినది అగు నీ దివ్య శిరస్సును స్తుతించు చున్నాను.

10. ఇతి శ్రీభవానీ! స్వరూపం తవేదం
ప్రపంచాత్పరం చాతి సూక్ష్మం ప్రసన్నమ్॥
స్ఫురత్వంబ బింబస్య(డింభస్య) మే హృత్సరోజే
సదా వాఙ్మయం సర్వతేజోమయం చ।

ఓ శ్రీభవానీ! ఇట్లు నీ స్వరూపము ప్రపంచమున కతీతముగా, అతి సూక్ష్మముగా, ప్రసన్నముగా, వాఙ్మయముగా, సర్వతేజోమయంగా ఉన్నదై నీ శిశువైన నా హృదయ పద్మంలో ఎల్లప్పుడు వెలుగొందుగాక.

11. గణేశాణి మాద్యాఖిలైః శక్తిబృందై-
ర్వృతాం వై స్ఫురచ్చక్ర రాజోల్లసన్తీమ్।
పరాం రాజరాజేశ్వరి! త్రైపురి! త్వాం
శివాంకోపరిస్థాం శివాం భావయామి॥

గణేశునితోనూ మరియు అణిమ మొదలైన సమస్త శక్తి సమూహములతోనూ చుట్టుకొనబడినదానవు, ప్రకాశించు శ్రీచక్రంలో వెలుగొందుచున్నదానవు,

పరాశక్తివి, శివుని ఎడమతొడపై కూర్చున్నదానవు, శుభకరమైనదానవు అగు నిన్ను ఓ రాజరాజేశ్వరీ! నేను ధ్యానించుచున్నాను.

12. త్వమర్కస్త్వ మిందుస్త్వ మగ్నిస్త్వ మాప-
స్త్వ మాకాశ భూవాయవస్త్వం మహత్త్వమ్।
త్వదన్యో న కశ్చిత్ప్ర(కాశోఽస్తి)పంచోస్తి సర్వం
త్వమానంద(సదానంద) సంవిత్స్వ రూపాం భజేఽహమ్॥

నీవే సూర్యుడు, నీవే చంద్రుడు, నీవే అగ్ని, నీవే నీరు, నీవే ఆకాశము, నీవే భూమి, నీవే వాయువు, నీవే మహత్తు. నీకంటే భిన్నంగా ప్రపంచమేలేదు. అంతా నీవే. ఆనందము మరియు జ్ఞానము రూపముగా కల నిన్ను నేను సేవించు చున్నాను.

13. శ్రుతీనామగమ్యే సువేదాగ మజ్ఞా
మహిమ్నో న జానంతి పారం తవాంబ।
స్తుతిం కర్తు మిచ్ఛామి తే త్వం భవాని
క్షమ స్వేద మత్ర ప్రముగ్ధః కిలాఽహమ్॥

వేదములకు కూడ అందనిదానా! వేదములను, ఆగమశాస్త్రములను తెలిసినవారు కూడా నీ మహిమలను చివరి వరకూ తెలుసుకొనలేరు. ఓ తల్లీ! భవానీ! నిన్ను స్తుతించుటకు ఆశపడుచున్నాను. నేను ఏమీ తెలియని వాడను కదా!

14. గురుస్త్వం శివస్త్వం చ శక్తిస్త్వమేవ
త్వమే వాసి మాతా పితాఽ చ త్వమేవ।
త్వమేవాసి విద్యా త్వమేవాసి బంధు(బుద్ధి)-
ర్గతిర్మే మతిర్దేవి! సర్వం త్వమేవ॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

నీవే గురువువు, నీవే శివుడవు, నీవే శక్తివి, నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే విద్యవు, నీవే బంధువువు(బుద్ధివి). ఓ దేవీ! నాకు గతి, మతి, సర్వం నీవే.

15. శరణ్యే వరేణ్యే సుకారుణ్య మూర్తే
హిరణ్యో దరాద్యై రగణ్యే సుపుణ్యే।
భవారణ్య భీ తేశ్చ మాం పాహి భద్రే
నమస్తే నమస్తే నమస్తే భవాని॥

ఓ శరణ్యురాలా! శ్రేష్ఠురాలా! కారుణ్యమూర్తీ! బ్రహ్మాదులచే కూడ తెలుసుకొన శక్యం కాని దానా! పుణ్య మూర్తీ! మంగళరూపిణీ! భవానీ! అరణ్యము వంటి సంసారము వలన కలుగు భయమును తొలగించి నన్ను కాపాడుము.

16. ఇతీమాం మహచ్ఛ్రీ భవానీ భుజంగం-
స్తుతిం యః పఠేద్భక్తి యుక్తశ్చ తస్మై।
స్వకీయం పదం శాశ్వతం వేద సారం
శ్రియం చాష్ట సిద్ధిం భవానీ దదాతి॥

ఈ విధంగా గొప్పదైన శ్రీ భవానీ భుజంగ స్తోత్రమును భక్తితో పఠించువానికి భవానీ దేవి వేదసారమైన తన స్థానమును, సంపదను మరియు ఇష్టసిద్ధిని కలిగించును.

17. భవానీ భవానీ భవానీ త్రివారం-
హ్యు(ము)దారమ్ ముదా సర్వదా యే జపన్తి।
న శోకో(కం) న మోహో(హం) న పాపం న భీతిః
కదాచిత్కథంచిత్కు తశ్చిజ్జ నానామ్॥

మూడుసార్లు భవానీ భవానీ భవానీ అని ఆనందంగా ఎల్లప్పుడు జపించు వారికి శోకము, మోహము, పాపము, భయము ఎన్నడు, ఏ విధంగానూ ఎటునుండీ కలుగవు. //ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచిత భవానీ భుజంగ ప్రయాత స్తోత్రమ్ సమ్పూర్ణమ్//

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. -944 044 9650, 994 994 1430)